నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

10 | శనివారం 26 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# రజతోత్సవ సభకు రెడీ!

## సన్నద్ధమైన గులాబీ సేన

- శ్రేణులను ఏకం చేస్తున్న ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు
- ఇప్పటికే నియోజకవర్గాల్లో విస్తృతంగా సభలు, సమావేశాలు
- వాహనాలు.. రూట్ మ్యాప్ సిద్ధం చేసుకున్న నాయకులు, కార్యకర్తలు
- స్వచ్ఛందంగా తరలి వెళ్లేందుకు ఉత్సాహం
- మరోసారి సత్తా చాటే దిశగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా









మందమర్రిరూరల్ : వెంకటాపూర్‌లో పోస్టర్లు విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాల, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు సర్వం సిద్ధం కాగా, స్వచ్ఛందంగా తరలివెళ్లేందుకు గులాబీ సేన సన్నద్ధమైనది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 40 వేల మంది కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరుకానుండగా, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసింది.

### ఆవిర్భావం నుంచి బీఆర్ఎస్ వెన్నంటే..

2001లో బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ వెన్నంటే ఉన్నది. ఇప్పుడు మరోసారి అండగా నిలిచేందుకు సిద్ధమైంది. 14 ఏండ్ల సుదీర్ఘ ఉద్యమం చేసి స్వరాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్. పదేండ్ల పాలనలో అనేక అద్భుతాలు చేసింది. వ్యవసాయ రంగం మొదలు.. ఐటీ వరకు.. ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపింది. ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, పట్టణ, పల్లె ప్రగతి, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌వంటి పథకాలు చరిత్రలో నిలిచిపోయాయి. పొరుగున ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం సైతం తెలంగాణలో అధ్యయనం చేసి బీఆర్ఎస్ పథకాలను అనుసరించాయి. కొత్త జిల్లాల ఏర్పాటు, నియోజకవర్గాల్లో అభివృద్ధి పరుగులు పెట్టింది. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో బీఆర్ఎస్ మార్క్ పాలన కనిపించడం లేదు. రైతుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయి. పంట పెట్టుబడి సాయం రైతుబంధు రాకుండా పోయింది. రుణమాఫీ అరకొరగా అందింది. ఒకప్పుడు తెలంగాణలో కళకళలాడిన వ్యవసాయం తిరోగమన దిశలోకి వెళ్లిపోయింది. నీరు లేక పంటలు ఎండిపోయే దుస్థితి దాపురించింది. ఆరు గ్యారెంటీల అమలులో అధికార పార్టీ ఘోరంగా విఫలమైంది. ఏ ఒక్క పనీ.. సరిగా చేసి చూపింది లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితి నెలకొన్నది. ఏ ఒక్క వర్గం కూడా ఆనందంగా లేదనేది సుస్పష్టంగా కండ్ల ముందు సాక్షాత్కరిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ప్రాధాన్యత సంతరించుకున్నది. పాలనపై జనాలు మండిపడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. అధికారం కోల్పోయాక నిర్వహిస్తున్న తొలి సభను విజయవంతం చేసి.. బీఆర్ఎస్ సత్తా చాటేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నది.

### పార్టీ శ్రేణుల సమాయత్తం..

రజతోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడంపై అధినేత కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెలలో జిల్లాల వారీగా పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. సభను విజయవంతం చేయడానికి చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణులను ఏకం చేశారు. ఎక్కడికక్కడ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు జరిగాయి. నియోజకవర్గానికి మూడు వేల మందిని సభకు తరలించేలా కార్యాచరణ రూపొందించారు. అన్ని మండలాల్లోనూ సమావేశాలు నిర్వహించి పార్టీ కార్యకర్తలను సిద్ధం చేశారు. దీంతో చాలా మంది స్వచ్ఛందంగా సభకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గానికి మూడు వేల మంది అనుకుంటే.. నాలుగు వేల నుంచి ఐదు వేల మంది తరలివచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. లక్ష్యానికి మించి గులాబీ సైన్యం సభకు వెళ్లే అవకాశాలున్నాయి. సభ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహించడం పార్టీకి కలిసి వచ్చింది. ఎక్కడ మీటింగ్ పెట్టినా అద్భుతమైన స్పందన లభించింది. పార్టీలో తిరిగి చేరికలు ప్రారంభమయ్యాయి. రజతోత్సవ సభలో అధినేత కేసీఆర్, పార్టీ కార్యవర్గం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి 100 శాతం కట్టుబడి పని చేసేందుకు గులాబీ సైన్యం సిద్ధమైంది. ఎక్కడ చూసినా రజతోత్సవ సభ గురించి, కేసీఆర్ ఏం మాట్లాడుతారా.. ఏం పిలుపునిస్తారా..? అనే చర్చ ఆసక్తిగా నడుస్తున్నది.



మందమర్రి : గాంధీనగర్‌లో జెండాకు రంగులు వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### సభకు ఇలా వెళ్దాం

#### ఎల్కతుర్తి వేదికకు సులువుగా చేరేలా రూట్‌మ్యాప్

ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభా ప్రాంగణానికి సులువుగా చేరుకునేలా జోన్లవారీగా రూట్ మ్యాప్‌లను సిద్ధం చేశారు. లక్షలాదిగా తరలి వచ్చే బీఆర్ఎస్ బంధుగణం కోసం 5 జోన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జోన్ల వారీగా ప్రత్యేకంగా 5 పార్కింగ్ జోన్లను సైతం సిద్ధం చేశారు. సభా ప్రాంగణానికి మొత్తం నాలుగు రహదారుల గుండా వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

**కరీంనగర్ రూట్ :** ఇది 563వ జాతీయ రహదారి. ఈ రూట్ గుండా ఉమ్మడి కరీంనగర్, ఈస్ట్ ఆదిలాబాద్ (సిర్పూర్ కాగజ్‌నగర్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొంత పరకాల నియోజకవర్గాలు) నుంచి కార్యకర్తలు తరలివస్తారు.

**పార్కింగ్ జోన్ 4 :** కరీంనగర్ జాతీయ రహదారి 563 మీదుగా వచ్చే వాహనాలు హుజూరాబాద్, కోతులనడుమ, గ్రానైట్ క్వారీ మీదుగా ఈ పార్కింగ్ జోన్-4కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.



ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ సభా ప్రాంగణం

### సత్తా చాటేందుకు సిద్ధం

రజతోత్సవ సభలో ఉమ్మడి జిల్లా సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆయా జిల్లాల్లోని అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అధినేత దిశానిర్దేశం మేరకు భారీగా సభకు ముఖ్య కార్యకర్తలు, నాయకులను తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా లెక్క చేయకుండా పార్టీ శ్రేణులు సభకు వెళ్లేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి 60 నుంచి 70 బస్సులను సిద్ధం చేశారు. ఇవేగాకుండా కార్లలోనూ ముఖ్యనాయకులు, అభిమానులు తరలివెళ్లనున్నారు. ద్విచక్రవాహనాలపై ర్యాలీగా మరి కొందరు వెళ్లనున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఉదయాన్నే గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించాలని నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రతి గ్రామానికీ అవసరమైన భారీ గులాబీ జెండాలను సరఫరా చేశారు. ఉదయాన్నే జెండాలు ఎత్తుకొని బస్సుల్లో బయల్దేరి వెళ్లేందుకు రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేసుకున్నారు. మధ్యాహ్నం భోజనాలు చేసుకొని నేరుగా సభా ప్రాంగణానికి వెళ్లాలని, ట్రాఫిక్‌లో ఇరుక్కుపోకుండా సభకు ముందుగానే వెళ్లేలా సమయాత్తం అవుతున్నారు. ఈ మేరకు బస్సులు ఎక్కడికి వస్తాయి.. ఒక్క బస్సులో ఎంత మంది వెళ్లాలి.. మధ్యాహ్న భోజనం ఎక్కడ ఏర్పాటు చేశారు ? అనే వివరాలన్నీ ఇప్పటికే ఇన్‌చార్జిలకు అందజేశారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్తున్నారు. ఈ రజతోత్సవ సభ జిల్లాలో పార్టీకి పుర్వవైభవం తీసుకురావడంలో కీలక భూమిక పోషించనున్నదని పార్టీ నాయకులు, కార్యకర్తలు విశ్వసిస్తున్నారు.



ధర్నా చేస్తున్న ఎల్లక్కపేట కాలనీ వాసులతో మాట్లాడుతున్న చెన్నూర్ సీఐ దేవేందర్ రావు

- ఎల్లక్కపేట కాలనీవాసుల ఆగ్రహం
- 90 మందికి నలుగురినే ఎంపిక చేస్తారా అంటూ ఫైర్
- చెన్నూర్-మంచిర్యాల జాతీయ రహదారిపై ధర్నా
- రెండు గంటల పాటు నిలిచిన వాహనాలు
- కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామంటూ ఆవేదన

# అనుకూలంగా ఉన్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లా?

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 25 : 'ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నోళ్లను.. డబ్బులిచ్చినోళ్లనే ఇండ్లకోసం ఎంపిక చేసిన్రు. అర్హులమైన తమకు అన్యాయం చేసిన్రు. మళ్లా సర్వే చేసి న్యాయం చేయాల్సిందే' అని డిమాండ్ చేస్తూ మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్లక్కపేట కాలనీ వాసులు రోడ్డెక్కారు. శుక్రవారం స్థానిక చెన్నూర్-మంచిర్యాల జాతీయ రహదారిపై ధర్నా చేశారు. అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం కిష్టంపేట గ్రామ పంచాయతీ నుంచి సుమారు 1100 మంది దరఖాస్తు చేసుకుంటే.. తమకు అనుకూలంగా ఉన్న 70 మందిని మాత్రమే ఎంపిక చేశారని, అలాగే ఎల్లక్కపేట నుంచి 90 మంది దరఖాస్తు చేసుకుంటే.. నలుగురినే ఎంపిక చేశారంటూ మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులకు డబ్బులిస్తేనే ఎంపిక చేస్తున్నారని, తామంతా కూలీలమని.. తాము బతకడమే కష్టంగా ఉందని.. ఇగ డబ్బులెక్కడి నుంచి తీసుకురమ్మంటారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగినా.. డబ్బులు అడిగినా కఠిన చర్యలు తీసుకుంటామని బుధవారం ఎమ్మెల్యే వివేక్ తన కారులో ప్రయాణిస్తూ వీడియో రిలీజ్ చేశారని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ఓటేస్తే.. నట్టేట ముంచిందని ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యే వివేక్ మా కాలనీలో మార్నింగ్ వాక్ చేసి సమస్యలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాతో సుమారు రెండు గంటల పాటు ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. చెన్నూర్ సీఐ రవీందర్, ఎస్ఐ సుబ్బారావు, అధికారులు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. మళ్లీ సర్వే చేసి ఎంపిక చేస్తామని వారు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

### అంతా పెద్ద లీడర్ల చేతుల్లోనే..




నేను కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక అంతా పెద్ద లీడర్ల చేతుల్లోనే ఉంది. ఇండ్లు ఉన్న వాళ్లకే మళ్లా ఇండ్లు రాస్తున్నరు. ఎలాంటి సర్వేలు చేపట్టింది లేదు. మా ఎల్లక్కపేటలో చిన్న చిన్న ఇండ్లలో పెద్ద పెద్ద కుటుంబాలుంటున్నాయి. అంతా కూలీ పనులకు వెళ్లే వాళ్లమే. మాకు భూములు కూడా లేవు. సర్వేకు వస్తేనే కదా అధికారులకు మా సమస్యలు తెలుస్తాయి. కానీ ఎవరూ మా వైపు చూడడం లేదు. లీడర్లు తమకు అనుకూలంగా ఉన్న వాళ్లనే ఎంపిక చేస్తున్నరు. దీని వల్ల అర్హులకు ఇండ్లు రాకుండా పోతున్నయి. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే.. ముంచుతున్నరు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వివేక్ మా కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలి. *- వెంకటేశ్, కాంగ్రెస్ నాయకుడు, ఎల్లక్కపేట*

# ఉగ్రదాడిపై ఆగ్రహం

- పలుచోట్ల నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన
- కొవ్వొత్తులతో ర్యాలీ

చెన్నూర్/కోటపల్లి/మందమర్రి/సీసీసీ నస్పూర్/రామకృష్ణాపూర్/దండేపల్లి/హాజీపూర్/దహెగాం/ఆసిఫాబాద్ టౌన్/రెబ్బెన/, ఏప్రిల్ 25 : పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడంపై ముస్లిం సోదరులు, వివిధ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. చెన్నూర్‌లో మృతులకు నివాళులర్పించారు. కోటపల్లి మండలం లింగన్నపేటలో గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. మందమర్రి పట్టణంలో క్రీడాకారులు మార్కెట్ నుంచి సింగరేణి పాఠశాల వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. మార్కెట్ ఏరియాలోని ఆస్రా మసీదులో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి కనపర్తి రమేశ్, ఉమ్మడి జిల్లా మర్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్, హరికృష్ణ, రాజేశ్, రమేశ్ రాజా, రవి, కృష్ణ, కుమార్, శృతి, హర్ష, రాజేశం పాల్గొన్నారు. సీసీసీ నస్పూర్‌లో ట్రస్మా సమావేశం నిర్వహించారు. ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బత్తిని దేవన్న, గౌరవ సలహాదారు శ్రీనివాస్, మండల కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి రాజ్‌కుమార్, ప్రమోద్, అమన్‌ప్రసాద్, సుధాకార్, పరమేశ్వర్ పాల్గొన్నారు. రామకృష్ణాపూర్ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్, ఈద్గా కమిటీల ఆధ్వర్యంలో పట్టణంలో అన్ని మసీదుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నమాజ్ చేశారు. కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. అక్బర్ అలీ, ఆరీఫ్, ఎండీ సలీం, ఖాజా, ఖాన్, సమ్రాన్, ఖలీం, అంకుష్, రియాజ్, షఫీ, ఖాదర్, హఫీజుద్దీన్ పాల్గొన్నారు. దండేపల్లి మండలం తాళ్లపేటలోని మసీదుల వద్ద మైనార్టీ వెల్ఫేర్ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మసీదు కమిటీ అధ్యక్షుడు దావూద్‌ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు ఎలుగూరి వేణు, ముస్లింలు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ వనజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. ఆసిఫాబాద్‌లోని జామా, హుదా మసీదుల్లో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నమాజ్ చేశారు. జామా మస్జిద్ ఇమామ్ మొహమ్మద్ అయాజ్ అష్రఫీ, నాయకులు అబ్దుల్ ఫయాజ్, అబ్దుల్ రహమాన్ షబ్బీర్, సాజిద్, సాలం, ఎండీ అహ్మద్, తాజ్, ఇమ్రాన్, లాయక్ హుస్సేన్ , షాహిద్ హుస్సేన్, అఖిల్, ముబాషిర్, నజీర్, గులాం జావిద్, అబ్దుల్లా బిన్ ఉమర్, మోసిన్ బిన్ అమర్, అవున్ బిన్ అలీ, ఖలీద్ బిన్ అబ్దుల్లా, హసన్ బిన్ ఖలీద్, అఖిల్ పాల్గొన్నారు. రెబ్బెన మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నమాజ్ చేశారు. మసీదు కమిటీ సభ్యులు ముజామ్మిల్, జమీర్, ఉదేదుల్లా, మత పెద్దలు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ టౌన్ : జామా మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు




హాజీపూర్ : కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

# స్లాబు కూల్చివేత

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

### త్వరలో మిగతావన్నీ తొలగిస్తామన్న కార్పొరేషన్ అధికారులు

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 25 : పట్టణంలోని బైపాస్‌రోడ్డులోగల రెడ్డికాలనీ వద్ద రాంచెరువు మత్తడి కాలువపై అక్రమంగా నిర్మించిన స్లాబును శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. మిగిలిన ప్రాంతాల్లో నిర్మించిన వాటిని కూడా త్వరలోనే తొలగిస్తామని వారు తెలిపారు. శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'రాంచెరువు మత్తడి కాలువపై స్లాబులు' శీర్షికన కథనం ప్రచురితం కాగా, టౌన్ ప్లానింగ్ అధికారి సంపత్ ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సాయంతో కాలువపై నిర్మించిన స్లాబును కూల్చివేశారు. రెడ్డికాలనీతో పాటు బైపాస్‌రోడ్డులోనే తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో ఒకచోట, మెయిన్‌రోడ్‌లో పలు భవనాల యజమానులు మత్తడి కాలువపై నిర్మించిన స్లాబులు, వంతెనలను త్వరలోనే తొలగిస్తామని టీపీవో తెలిపారు.



రెడ్డికాలనీ వద్ద రాంచెరువు మత్తడి వాగుపై నిర్మించిన స్లాబును కూల్చివేసిన అధికారులు